సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 2 । నవంబర్ । 2023



గీత దాటొద్దు...

ఎన్నికల వేళ అభ్యర్థులు, నాయకులు హద్దు మీరకుండా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను రూపొందించింది. 10లో



అథ్లెటిక్స్ పోటీలకు స్పందన

ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 242 మంది హాజరుకాగా, ప్రతిభ చాటిన వారితో జట్లను ఎంపిక చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 23°

వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. తెల్లవారుజామున మంచు కురిసి చలి వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించారు. ప్రస్తుతం 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 7 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో సూచించారు.

ఆయిల్‌పామ్ గెలల క్రషింగ్ నిలిపివేత

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో గురువారం నుంచి గెలల క్రషింగ్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ఉత్పత్తి తక్కువగా ఉండడంతో ఫ్యాక్టరీలో వార్షిక నిర్వహణ చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గెలల క్రషింగ్ నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈమేరకు రైతులు గెలలను దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీకు తరలించాలని, అశ్వారావుపేటలో ఎప్పటి నుంచి క్రషింగ్ చేపట్టేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మా ఊళ్లోకి రావొద్దు

ఎమ్మెల్యే వనమా ప్రచార రథాన్ని అడ్డుకున్న దివ్యాంగుడు

సుజాతనగర్: మా ఊళ్లోకి రావొద్దంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రచార రథాన్ని ఓ దివ్యాంగుడు అడ్డుకున్న ఘటన మండలంలోని సింగభూపాలెం లో బుధవారం చోటుచేసుకుంది. దళితబంధు పథకానికి డబ్బులు అడుగుతున్నారని, దివ్యాంగుడినైన తాను డబ్బు ఎక్కడి నుంచి తేవాలని ఆవేదన వ్యక్తం చేశాడు. కొందరు నాయకులు బీసీ రుణాల్లో కూడా అవినీతికి పాల్పడ్డారని తెలిపాడు. కాగా ప్రచార రథాన్ని అడ్డుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

దమ్మపేటలోనే అధికంగా నగదు సీజ్..

ఆంధ్రకు సరిహద్దున ఉండడమే కారణమా?



మండలపల్లి చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడిన నగదును సీజ్ చేస్తున్న సిబ్బంది

దమ్మపేట: ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. అయితే జిల్లా మొత్తంగా చూస్తే దమ్మపేట మండల పరిధిలోని చెక్‌పోస్టుల వద్ద జరిపిన తనిఖీల్లోనే అధికంగా నగదు సీజ్ చేస్తుండడం గమనార్హం. మండలంలోని మండలపల్లి, గణేష్‌పాడు గ్రామాల్లో రాష్ట్రీయ రహదారిపై రెండు చెక్‌పోస్టులు, అల్లిపల్లి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల వద్ద బుధవారం వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.35.80లక్షల నగదు సీజ్ చేశారు. దమ్మపేట మండలం ఏపీకి సరిహద్దున ఉండడంతో వ్యాపారులతో పాటు సాధారణ ప్రజలు కూడా సరుకుల కొనుగోలు, వైద్య చికిత్సలు, ఇతర అవసరాల నిమిత్తం ఎక్కువగా ఏలూరు, విజయవాడ వంటి నగరాలకు వెళ్తుంటారు. అలాంటి సమయాల్లో వారు తీసుకెళ్తున్న నగదుకు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోతున్నారు. దీంతో పోలీసులు సీజ్ చేస్తుండగా.. తిరిగి రాబట్టుకునేందుకు ఇక్కట్లు తప్పడం లేదు.

హరిప్రియ నా బిడ్డలాంటిది



ఇల్లెందు సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



వేదికపై సీఎంతో పాటు మంత్రులు సత్యవతిరాథోడ్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు తదితరులు

రాబోయే ఎన్నికల్లో ఆమెకు ఓటు వేసి గెలిపించండి

- ఇల్లెందు నియోజకవర్గానికి ఎన్నో పనులు చేసింది
- పోడు పట్టాలతో చరిత్రలో ఆమె పేరు నిలిచిపోతుంది
- హరిప్రియ గెలుపు ఖాయమనే నమ్మకం కలుగుతోంది
- ఇల్లెందు ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ తనకు బిడ్డలాంటిదని సీఎం కేసీఆర్ అన్నారు. బిడ్డ కోరితే తాను కాదనను అని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో హరిప్రియ నాయక్‌ను గెలిపించుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని ప్రజలను కోరారు. బుధవారం ఇల్లెందులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు.

నాతో కొట్లాడింది

ఒకప్పుడు వర్షం వస్తే ఇల్లెందులో చెప్పులు చేతిలో పెట్టుకుని నడవాల్సిన దుస్థితి వచ్చేదని, కానీ హరిప్రియనాయక్ ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రతీ ఊరికి రోడ్లు వేయించి ఆ సమస్యను తీర్చిందని సీఎం కేసీఆర్ అన్నారు. దీని కోసం ఒకటికి నాలుగు సార్లు తనతో మాట్లాడిందన్నారు. 'సార్ మాదీ ఏజెన్సీ ప్రాంతం, మీ దయ మాపై ఎక్కువగా ఉండాలి' అంటూ కొట్లాడి మరీ నియోజకవర్గానికి నిధులు తెచ్చిందన్నారు. ఒకప్పుడు ఇల్లెందు పట్టణం మురికిగా ఉండేదని, కానీ హరిప్రియ ఇల్లెందు పట్టణాభివృద్ధికి రూ. 350 కోట్ల నిధులు రాబట్టిందని అన్నారు. దీంతో సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లతో అభివృద్ధి చేసి పట్టణాన్ని ఓ దరికి తెచ్చిందన్నారు. గతంలో ఎంతోమంది ఎమ్మెల్యేలు ఉన్నా ఎవరూ ఇలా చేయలేదన్నారు. ప్రజలు ఈ అంశాన్ని గుర్తుంచుకుని రాబోయే ఎన్నికల్లో హరిప్రియకు ఓటెయ్యాలని కోరారు.

48 వేల ఎకరాలకు పోడు పట్టాలు..

పోడు భూములకు పట్టాల పంపిణీతో హరిప్రియ పేరు చరిత్రలో నిలిచిపోతుందని కేసీఆర్ అన్నారు. ఆమె హయంలోనే 48 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు జారీ అయ్యాయని, దీంతో 15వేల కుటుంబాలకు లబ్ధి జరిగిందని తెలిపారు. ఆయా రైతులకు రైతుబంధు, రైతుబీమా, త్రీ ఫేస్ కరెంటు కూడా ఇచ్చామన్నారు. పోడు భూముల ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసులను ఎత్తివేశామన్నారు.

గెలిపిస్తే కొత్త మండలాలు..

రాబోయే ఎన్నికల్లో గెలిపిస్తే హరిప్రియ కోరినట్టు కొమురారం, బోడును మండలాలుగా చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. హరిప్రియ తన బిడ్డలాంటిదని, ఆమె కోరినవన్నీ కాదనకుంటా నెరవేరుస్తానని అన్నారు. ఆమె ఇంటి కోసం ఏమీ అడగటం లేదని, ప్రజల కోసమే అడుగుతోందని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే హరిప్రియ ప్రస్తావించిన అంశాలన్నింటిపైనా సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఇల్లెందు నియోజకవర్గంలో ఎత్తయిన ప్రాంతంలో ఉన్న రెండు మండలాలకు కూడా నీరు అందిస్తామని, ఇందు కోసం లిఫ్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

నమ్మకం కలిగింది..

గిరిజన నియోజకవర్గాల్లో సభలకు పెద్దగా జనాలు రారని, కానీ ఇల్లెందు సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే హరిప్రియనాయక్ గెలుపు ఖాయమని నమ్మకం కలిగిందని అన్నారు కేసీఆర్. ఎన్నికలైన తర్వాత ఒకరోజు ఇల్లెందు వచ్చి మీ మధ్యనే ఉంటానని చెప్పారు.

కేసీఆర్ రాష్ట్ర సంపద పెంచారు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ప్రజా ఆశీర్వాద సభలో ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత పదేళ్లలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్ర సంపద పెరిగిందని అన్నారు. ఆరు దశాబ్దాల కల అయిన ఇల్లెందు బస్ డిపోను కేసీఆర్ చలువతో సాధించామని, 100 పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్ కూడా వచ్చాయని అన్నారు. గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చి వారి జీవితాలను మార్చారని తెలిపారు. ఇల్లెందులో రూ.1800 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, రూ.1100 కోట్లతో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వివరించారు. ఇల్లెందు నియోజకవర్గంలో 2.14 లక్షల మంది ఓటర్లుంటే 1.72 కోట్ల మంది సంక్షేమ పథకాలు పొందిన వారేనని తెలిపారు. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీతారామ ప్రాజెక్టును అందించారని, సింగరేణి కార్మికులకు 22 శాతం లాభాల వాటా పంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎన్నో చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని, మళ్లీ అధికారంలోకి రాగానే కొమురారం, బోడు మండలాల ప్రకటన చేయాలని కోరుతున్నామని అన్నారు. ఇల్లెందును రెవెన్యూ డివిజన్ చేయాలని కూడా ఆమె వేడుకున్నారు. గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇవ్వాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనకు చర్యలు చేపట్టాలని కోరారు.

కరోనా కాలంలో గర్భవతిగా ఉండి కూడా ప్రజలందరికీ అండగా ఉన్నానని, సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ఇప్పుడు బీ ఫాం తెచ్చుకున్నానని అన్నారు. 'మీ అందరి ఆశ్వీరాదాలు ఉండాలి' అంటూ బంజారా భాషలో కోరారు. సభలో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర రావు, రేగా కాంతారావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నాయకులు బొంతు రామ్మోహన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీపాషా, కోనేరు సత్యనారాయణ, టీజీబీకేఎస్ నేతలు వెంకట్రావు, రాజిరెడ్డి, కళ్లెం కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, ఇల్లెందు, గుండాల, టేకులపల్లి సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.



ఎమ్మెల్యే హరిప్రియ కుమార్తె రుద్రభారతీప్రియను లాలిస్తున్న సీఎం కేసీఆర్

సభ సైడ్‌లైట్స్

- సీఎం కేసీఆర్ సాయంత్రం 4.01 గంటలకు హెలీకాప్టర్ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకున్నారు
- 4.13 గంటలకు వేదిక పైకి వచ్చారు
- 25 నిమిషాల పాటు కేసీఆర్, ఏడు నిమిషాల పాటు హరిప్రియ ప్రసంగించారు
- 5 గంటలకు కేసీఆర్ తిరిగి వెళ్లిపోయారు
- సీఎం ఉత్సాహభరిత ప్రసంగంతో అందరిలోనూ హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి
- ఎమ్మెల్యే హరిప్రియను బిడ్డగా, దిండిగల రాజేందర్‌ను ప్రియమిత్రుడిగా కేసీఆర్ సంబోధించారు
- ఇల్లెందు పోరాటాల పురిటిగడ్డ అని సీఎం అని సీఎం కీర్తించారు
- మధ్యాహ్నం 2 గంటల నుంచే ప్రజలు సభకు రావడం కనిపించింది
- అందరికీ పార్టీ కార్యకర్తలు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేశారు

సభలో జోష్..

ప్రసంగం కొనసాగుండగా ఓ వ్యక్తి అదే పనిగా నినాదాలు చేస్తుండటంతో కేసీఆర్ కల్పించుకుని 'ఇదేమైనా సర్కసా?. ఇక్కడ నేను మొత్తుకునుడు.. అక్కడ నువ్వు మొత్తుకునుడు.. స్పీచ్ అయినంక నువ్వో గజం.. నేనో గజం దూకుదాం.. ఆగుజర' అన్నారు. అంతకు ముందు మరోవ్యక్తిని ఉద్దేశించి ఆగాగు.. ఏయ్ ఎవరైనా ఆయన దగ్గరున్న కాయితం తీసుకోండి' అంటూ సూచించారు. రైతుబంధు పథకం ఉండాలా ? ధరణి ఉండాలా వద్దా అంటూ సభికులకు ప్రశ్నలు వేశారు కేసీఆర్. ఉండాలని అనే వారు చేతులు ఎత్తాలంటూ కోరగా సభలో పెద్ద ఎత్తున చేతులు పైకి లేచాయి. పలుమార్లు ఇలా చేయడంతో ఒక్కసారిగా సభలో జోష్ వచ్చింది.

జంగ్ తెలంగాణ



బహిరంగసభకు హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 5వ తేదీ సెలవు రోజున స్వీకరించబోమని తెలిపారు. ఒకే రోజు ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు వస్తే టోకెన్లు జారీ చేసి సీరియల్ ప్రకారం స్వీకరించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల ప్రక్రియపై అభ్యర్థులకు అవసరమైన సలహాలు, సూచనలు చేసేందుకు హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితోపాటు మరో నలుగురిని, మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ద్వారా కూడా నామినేషన్ వేసే అవకాశం ఉందని తెలిపారు. జనరల్, బీసీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలని చెప్పారు. రాష్ట్రంలో ఓటున్నవారు ఎక్కడి నుంచైనా పోటీ చేసే అవకాశం ఉందన్నారు. అయితే బలపర్చే వారు మాత్రం ఆ నియోజకవర్గం వారే అయి ఉండాలని తెలిపారు. ఆర్ఓలు నిశితంగా పరిశీలించి నామినేషన్లను ధ్రువీకరించాలని సూచించారు. ప్రతి రోజు నామినేషన్ల దాఖలుపై నివేదికలు అందజేయాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ప్రతీక్‌జైన్, రాంబాబు, శిరీష, కార్తీక్, మంగీలాల్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, డీటీ రంగాప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో జర జాగ్రత్త !



సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా సోషల్ మీడియాపై కూడా ఈసీ దృష్టి సారించింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వచ్చే కథనాలు, వార్తలపైనే కాకుండా సోషల్ మీడియాలో జరిగే చర్చలు, పోస్టులనూ నిశితంగా పరిశీలిస్తోంది. చాలా వాట్సాప్ గ్రూపులలో ఎన్నికలకు సంబంధించి, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి, సీట్ల కోసం వెంపర్లాడుతూ పార్టీలు మారుతున్న విషయాలపై కొందరు బాహాటంగానే చర్చిస్తున్నారు. డబ్బు పంపిణీ విషయంలోనూ చర్చ నడుస్తోంది. ఎవరికి తోచిన విధంగా వారు పోస్టులు పెడుతున్నారు. ప్రచారానికి సంబంధించి, రెచ్చగొట్టే వాఖ్యలపై ఎన్నికల సంఘం నిఘా పెట్టింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అడ్డగోలు వ్యాఖ్యలు పెట్టొద్దని వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు సూచిస్తున్నా అర్థం చేసుకోకుండా కొంతమంది అదేపనిగా తమ భావాలను వ్యక్తీకరిస్తున్నారు. కొందరు అడ్మిన్లు అప్రమత్తంగా ఉండి వాటిని వెంటనే డిలీట్ చేస్తున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవు. వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టేవారు జాగ్రత్తగా ఉండాలని అటు ఎన్నికల అధికారులు, ఇటు పోలీసులు సూచిస్తున్నారు.

శిలాఫలకాలకు కోడ్ లేదా?

చుంచుపల్లి: ఇది కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో అభివృద్ధి పథకాల పైలాన్ దిమ్మె. ఖమ్మం - భద్రాచలం జాతీయ రహదారిపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించిన పనుల వివరాలను నాలుగు వైపులా ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 20 రోజులు అయినా ఈ శిలాఫలకం దిమ్మెను కప్పి వేయకుండా వదిలేశారు. జిల్లా కేంద్రంతో పాటు పలుచోట్ల శిలాఫలకాల విషయంలో ఎన్నికల కోడ్ అమలు చేయకుండా ఓపెన్‌గానే ఉంచినట్లు 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది.



- జిల్లాలో పలుచోట్ల శంకుస్థాపన, ప్రారంభోత్సవ రాళ్లు
- ముసుగు వేయని అధికారులు
- నిబంధనలకు విరుద్ధమంటున్న పలువురు

పకడ్బందీగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని జిల్లా అధికార యంత్రాంగం పదే పదే చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతూనే ఉంది. అధికారులు చెప్పడం వరకే కానీ, ఆచరణలో అమలు అవుతుందా లేదా అనేది పర్యవేక్షణ కరువైందని శిలాఫలకాల దిమ్మెలను చూస్తే తెలుస్తోంది. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలును అధికారులు తుంగలో తొక్కారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల పరిధిలో విచ్చలవిడిగా ఉన్న శిలాఫలకాల దిమ్మెలకు కోడ్ వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంతో పాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ వంటి పరిసర మండలాల్లో వందల సంఖ్యలో శిలాఫలకాలు ఓపెన్‌గానే కనిపిస్తున్నాయి. ఈ శిలాఫలకాలపై ఎమ్మెల్యేలు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో పాటు స్థానిక నాయకుల పేర్లు కనిపిస్తున్నాయి. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఇలాంటి శిలాఫలకాలు వేల సంఖ్యలో ఉన్నాయి. తొలుత ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు హడావిడి చేసిన అధికారులు.. ఫ్లెక్సీలను తొలగించి, నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. కానీ శిలాఫలకాలపై మాత్రం దృష్టి సారించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బహిరంగంగా కనిపిస్తున్న శిలాఫలకాల దిమ్మెలకు ముసుగులు వేయాలని పలువురు కోరుతున్నారు.



రామాంజనేయ కాలనీకి వెళ్లే దారిలో కనిపిస్తున్న శిలాఫలకం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిద్దాం...

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

ఖమ్మం రాపర్తినగర్: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఖమ్మంలో బుధవారం ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రజల ఆకాంక్షలను మరిచిపోయారని విమర్శించారు. ఈమేరకు ఆయనను ఓడించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న నేపథ్యాన ఆ పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు పాటుపడాలని కోదండరాం పిలుపునిచ్చారు. టీజేఎస్ ఖమ్మం జిల్లా కన్వీనర్ వి.బాబుతో పాటు నాయకులు గోపగాని శంకర్రావు, అంబటి శ్రీనివాసరావు, రామనాథం దేవదానం, కరుణాకరరెడ్డి, సర్దార్, జంగిపల్లి రవి, బానోత్ ప్రసాద్, సత్యనారాయణ, ఆంజనేయులు, డేవిడ్, పాపారావు, గణేష్, సాంబయ్య, శ్రీను, రమేష్, తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న కోదండరాం

కాంగ్రెస్‌తోనే ఉద్యమకారులకు మేలు

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే తెలంగాణ ఉద్యమకారులకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమ్మేళనంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల జీవితాలు మెరుగుపడాలన్నా, సమస్యలు పరిష్కారం కావాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరముందని చెప్పారు. ఉద్యమకారులకు ఉచిత బస్‌పాస్, 250గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షల నగదు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రామారావు, శంకర్‌రావు, విద్యాసాగర్, సుధాకర్, గుంతేటి వీరభద్రం, డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్, పద్మాచారి పాల్గొన్నారు.

గీత దాటొద్దు.. హద్దు మీరొద్దు

శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా, శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసి అదేరోజు నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు వీటిని తు.చ. తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఉల్లంఘించినా ఇబ్బందులు తప్పవనే విషయాన్ని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని యంత్రాంగం సూచిస్తోంది.

– ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్

ఎన్నికల వేళ కీలకంగా మార్గదర్శకాలు

- ఎవరైనా పాటించకపోతే ఇక్కట్లే
- అనుక్షణం గమనించే నిఘా కళ్లు
- రేపటి నుంచి మొదలుకానున్న నామినేషన్ల ప్రక్రియ



ఖమ్మం ఆర్‌ఓ(కేఎంసీ) కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో వేసిన గీత

మార్గదర్శకాలివే..

అభ్యర్థి కానీ పార్టీ కానీ కులమత భాషా విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం కానీ ప్రసంగించడం కానీ చేయొద్దు. విధానాలు, కార్యక్రమాలపైనే ప్రసంగాలు, విమర్శలు ఉండాలి. వ్యక్తిగత జీవితంపై విమర్శలు ఉండకూడదు. కుల, మత ప్రాతిపదికపై ఓట్లు అడగకూడదు. ప్రార్థనా ప్రదేశాలను ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించొద్దు. ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించడం నిషేధం. యజమానుల లేకుండా వాళ్ల భూమి, బిల్డింగులను ప్రచారానికి ఉపయోగించరాదు. ఇతర పార్టీల ఎన్నికల ప్రచారాన్ని, మీటింగ్‌లకు ఆటంకం కలిగించొద్దు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్

రాజకీయ పార్టీలన్నీ అంగీకరించిన మార్గదర్శక సూత్రాలు, నిబంధనలతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) రూపొందించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పక్షపాతం లేకుండా పారదర్శకంగా పూర్తయ్యేలా ఈ నియమావళి దోహదపడుతుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయకూడదు. అధికారిక పర్యటనలను ఎన్నికల పనిలో కలపవద్దు. ప్రభుత్వ వాహనాలు ఉపయోగించకూడదు.

ప్రచారం

విద్యాసంస్థలు, వాటి మైదానాలను ప్రచారానికి వాడకూడదు. ప్రైవేట్ భూములు, భవనాల యజమానుల లిఖితపూర్వక అనుమతి తీసుకుని పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇచ్చాకే గోడ పోస్టర్లు అంటించాలి. కరపత్రాలు, పోస్టర్లపై ముద్రణాలయాల పేరు, చిరునామా ముద్రించాలి. ప్రచారంలో భాగంగా టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు. అయితే, వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ఇక చీరలు, చొక్కాలు ఇవ్వకూడదు. దేవుళ్ల ఫొటోలు, అభ్యర్థి ఫొటోలతో డైరీలు, క్యాలెండర్లు ప్రచురించరాదు. వాహనాల స్టెపినీ కవర్లపై కూడా మత సంబంధిత ఫొటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండడానికి వీలు లేదు. ఎన్ని వాహనాలైనా ఎన్నికల ప్రచారానికి ఉపయోగించవచ్చు. అయితే, రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకుని ఒరిజనల్ అనుమతిపత్రాన్ని వాహనానికి అంటించాలి. పర్మిట్ వాహనాన్ని అదే అభ్యర్థి వినియోగించాలి. ఇంకొకరు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటారు.

నామినేషన్ల దాఖలు

రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం నుంచి వంద మీటర్ల పరిధిలోకి మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారు. అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులకు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుంది.

పరిశీలన

అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్, ఒక ప్రతిపాదకుడు, మరో వ్యక్తి(న్యాయవాది కావచ్చు) పరిశీలనకు వెళ్లవచ్చు. దీనికి అభ్యర్థి రాతపూర్వకంగా అనుమతి అవసరం ఉంటుంది.

తాత్కాలిక కార్యాలయాలు

ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్లలోపు అభ్యర్థుల తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటుచేయొద్దు. కార్యాలయంపై పార్టీ జెండా, బ్యానరు, పార్టీ చిహ్నాన్ని పెట్టుకోవచ్చు. రాత్రి 10 గంటల తర్వాత, ఉదయం 6గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు. రాత్రి 10 గంటల తర్వాత పబ్లిక్ మీటింగ్‌లు నిలిపేయాలి. ఎస్ఎంఎస్‌ల ద్వారా అభ్యంతకర వార్తలను ప్రచారం చేయొద్దు.

అనుమతి తప్పనిసరి

సమావేశాలకు ముందుగానే లిఖితపూర్వకంగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. నిషేధాజ్ఞలు /ఆంక్షలు ఉన్న ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించద్దు. మీటింగులో వాడే మైక్‌లు, లౌడ్ స్పీకర్లకు సైతం అనుమతి తీసుకోవాలి. సమావేశానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్ప సొంతంగా చర్యలు తీసుకోవద్దు. ఇక ఊరేగింపుల విషయమై కూడా పోలీసులకు ముందుగా తెలియచేయాలి. ఆ మార్గంలో నిషేధాజ్ఞలు ఉన్నాయో తెలుసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందుకు సాగాలి. ఎవరి దిష్టిబొమ్మలు దహనం చేయొద్దు.

జంగ్ తెలంగాణ

పది నియోజకవర్గాల్లో యూసీసీఆర్ఐ పోటీ

అభ్యర్థులను ప్రకటించిన పార్టీ



పార్టీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం(యూసీసీఆర్ఐ–ఎంఎల్) పార్టీ నుంచి అభ్యర్థులు బరిలో నిలుస్తారని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య వెల్లడించారు. రాష్ట్రమంతా కలిపి నలభై నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధమవుతున్నామని తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పది నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఖమ్మం నుంచి బాణాల లక్ష్మణాచారి, పాలేరు నుంచి కొచ్చెర్ల గురవయ్య, మధిర నుంచి జంగం రామచంద్రయ్య, వైరా నుంచి పర్సా రాములు, సత్తుపల్లి నుంచి చిప్పలపల్లి వీరయ్య, కొత్తగూడెం నుంచి కల్తీ లెనిన్, భద్రాచలం నుంచి మర్మం తిరుపతమ్మ, అశ్వారావుపేట నుంచి కుంజ నాగమణి, పినపాక నుంచి వాసం మంగయ్య, ఇల్లెందు నుంచి పోలెబోయిన రవి పోటీ చేస్తారని తెలిపారు. కాగా, కేంద్రంలోని బీజేపీ, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు గడిచిన తొమ్మిదేళ్లుగా పెట్టుబడిదారీ శక్తులు, భూస్వాములకే తప్ప పేదలకు మేలు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలన్నీ కంటితుడుపు చర్యలే తప్ప ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడం లేదని తెలిపారు. పాలకుల వైఫల్యాలను వివరిస్తూ తమ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరనున్నట్లు వెల్లడించారు. ఈసమావేశంలో గ్రామీణ పేదల సంఘం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రధాన కార్యదర్శులు కల్తీ రామచంద్రయ్య, షేక్ సోందుమియా, పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి అరవింద్ పాల్గొన్నారు.

పినపాకలో ఆ రెండు మండలాలే కీలకం

అశ్వాపురం: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పినపాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములలో ఎక్కువ ఓటర్లు కలిగిన మణుగూరు, బూర్గంపాడు మండలాలు కీలకం కానున్నాయి. ఈ రెండు మండలాల్లో ఏ అభ్యర్థి మెజారిటీ సాధిస్తే వారే ఎమ్మెల్యేగా గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పినపాక నియోజకవర్గంలో 1,93,943 మంది ఓటర్లు ఉండగా మణుగూరు మండలంలో 55,906, బూర్గంపాడు మండలంలో 47,834 మంది ఓటర్లు ఉన్నారు. సగం కంటే ఎక్కువ ఓటర్లు ఈ రెండు మండలాల్లో ఉండటంతో నియోజకవర్గం అంతా ఒక వైపు ఉంటే ఈ రెండు మండలాలు ఇంకో వైపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అన్ని పార్టీల నాయకులు కూడా ఈ రెండు మండలాల ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అత్యధికంగా ఓట్లు సాధించేందుకు ముఖ్య నాయకులతో, బలమైన సామాజిక వర్గాల పెద్దలు, ప్రముఖులతో ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు మంతనాలు సాగిస్తున్నారు.

నాడు.. నేడు!

రోజులు మారుతున్న కొద్దీ.. సాంకేతికంగా వస్తున్న మార్పులతో ఓటరు గుర్తింపు కార్డులు నూతనత్వం సంతరించుకుంటున్నాయి. 1986 కంటే ముందు ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసేవారు. అనంతరం 1986 నుంచి ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ మొదలైంది. తొలినాళ్లలో ఈ కార్డులు కొంచెం పెద్దగా ఉండేవి. అంతేకాకుండా వివరాలు చేతితో రాసి ఇచ్చేవారు. ఆతర్వాత జేబులో పట్టే కార్డులు ఇవ్వడం మొదలుకాగా, ఫొటోతో సహా ముద్రిస్తుండడంతో ఆకట్టుకునేలా కనిపిస్తున్నాయి.

– ఖమ్మం మయూరిసెంటర్



1986లో చేతి రాతతో ఓటరు గుర్తింపు కార్డు..



పస్తుతం జారీ చేస్తున్న గుర్తింపు కార్డు

క్లుప్తంగా

రేపు అండర్-14, 17 క్రీడాజట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 బాలబాలికల క్రీడా జట్ల ఎంపికకు ఈనెల 3న పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. ఈ పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో జరిగే పోటీలకు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

మరో 'బెండాలపాడు' జరగడం ఖాయం

మావోయిస్టు మణుగూరు ఏరియా కమిటీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడు చెలక గ్రామ పంచాయతీ తోక బందాల గ్రామంలో గత సంవత్సరం నుంచి గిరిజన రైతులు వ్యవసాయం చేసుకుంటున్న 58 ఎకరాల భూమిని అటవీశాఖ అధికారులు ఆక్రమించారని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి సూర్య బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యాలు మానుకోకపోతే మరో బెండాలపాడు ఘటన జరగటం ఖాయమని హెచ్చరించారు. పునుకుడు చెలక గ్రామంలో పలువురు రైతుల నుంచి భూమిని బలవంతంగా లాక్కుని మొక్కలు నాటారని తెలిపారు. రైతుల ట్రాక్టర్లు, పనిముట్లను కూడా గుంజుకున్నారని, అడవిలోకి వెళ్లకుండా బెదిరిస్తున్నారని, గిరిజనులపై ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీట్ ఆఫీసర్లు దేవి, సుమిత్ర, డీఆర్‌ఓ నరేశ్‌లు రైతుల జోలికి పోతే తీవ్రమైన పరిణామాలు జరుగుతాయని హెచ్చరించారు. గిరిజనులపై అటవీశాఖ అధికారులు దౌర్జన్యం చేస్తే చూస్తు ఊరుకోబోమన్నారు.

ఐఈడీ పేలుడులో జవాన్‌కు గాయాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధిలోని మినపా–బూర్కపాల్ అటవీప్రాంతంలో ఐఈడీ పేలిన ఘటనలో కోబ్రా–206కు చెందిన జవాన్ అమరేంద్ర బసుమతారీ గాయపడ్డాడు. భద్రతా బలగాలు చింతగుఫా–మినపా అటవీప్రాంతంలో మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టి క్యాంపునకు తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. వెంటనే బలగాలు క్షతగాత్రుడిని క్యాంపునకు తరలించి చికిత్స అందచేస్తున్నారు.

వెలసిన మావోయిస్టు వాల్‌పోస్టర్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలను బహిష్కరించాలని కోరుతూ మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి చర్ల మండలంలోని తిప్పాపురం శివారులో ఉన్న పామేడు రోడ్‌లో వాల్‌పోస్టర్లు వేశారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని, రాజకీయ ఖైదీల విడుదల కోసం పోరాడాలని, జనతన సర్కార్‌ను విస్తరించాలని వాల్‌పోస్టర్లలో పేర్కొన్నారు. కాగా ఈ వాల్‌పోస్టర్లు హిందీలో ఉన్నాయి.

నగదు సీజ్

దమ్మపేట: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. మండల పరిధిలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద బుధవారం పోలీసులు రూ. 1,70,000 నగదును సీజ్ చేశారు. వైరా నుంచి ఏపీలోని విజయనగరం జిల్లాకు సరైన ఆధారాలు లేకుండా కారులో నగదు తీసుకెళ్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు.

భద్రాచలంలో రూ.84 వేలు...

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద బుధవారం ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 84 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత రశీదులు చూపకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గత నెల 22న జరిగిన దాడి ఘటనలో గాయపడ్డ వడ్డెబోయిన శివకుమార్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన వడ్డెబోయిన శివకుమార్‌పై గత నెల 22న కొందరు వ్యక్తులు దాడి చేశారు. తలకు బలమైన గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితుడు మీర్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ సంతోష్ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

బూర్గంపహాడ్: వేధింపుల ఘటనలో బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సారపాకకు చెందిన సాయిపద్మజకు పాల్వంచకు చెందిన శివసాయిరెడ్డితో 2020లో వివాహం జరిగింది. ఇటీవల శివసాయిరెడ్డి, తన తల్లి, మరో కుమారుడితో కలిసి వేధింపులకు పాల్పడుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,231

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు స్పందన

రెండు జిల్లాల నుంచి 246 మంది హాజరు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 246 మంది అథ్లెట్లు హాజరయ్యారు. వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్ల ఎంపికకు ఈ పోటీలు నిర్వహించినట్లు సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. బాలుర జట్టుకు ఆర్.అభినయ్, జె.దీక్షిత్, జి.తేజ్వాల్, ఎం.వెంకటేశ్వర్లు, పి.సాయితేజ, డి.సాయికుమార్, కె.మస్తాన్, సీహెచ్.వినయ్, బి.జస్వంత్, బి.విజయ్‌కుమార్, బి.వినయ్, జి.వెంకటసాయి, బి.వినయ్, ఎం.సంజీవ్, వి.అభిరామ్, ఎం.సాయితేజ, పి.గోపి, సాయికార్తీక్, కె.రాహుల్, బి.చందు, ఎ.వీరేందర్, కె.శ్రావణ్‌కుమార్, కె.రాహుల్, వి.రోహిత్, ఆర్.అభినయ్ నాయక్, ఆర్.ప్రణయ్‌నాయక్, వై.పవన్‌తేజను ఎంపిక చేశారు.

బాలికల జట్టు..

బాలికల జట్టుకు ఎ.మనుశ్రీ, డి.బిందు, బి.బిందు, బి.అషా, శ్రీకావ్య, డి.కోమలి, జె.జైష్ణవి, బి.అనూష, కె.సమ్మక్క, కె.భద్రమ్మ, ఎస్.కె.అఫ్రీన్, బి.కృష్ణవేణి, బి.పల్లవి, ఎన్.సరిత, పి.కరుణా, ఎస్.కల్పన, సీహెచ్.దాక్షాయణి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ పోటీలను సీనియర్ అథ్లెటిక్స్ అకాడమీ కోచ్ ఎం.డీ. గౌస్, పీఈటీలు ఎం.డీ.షఫీక్ అహ్మద్, సుధాకర్, రవి, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ముజహీద్దీన్, సైదేశ్వర్‌రావు, కృష్ణ, వీరరాఘవయ్య పర్యవేక్షించారు.

సరదాగా కాసేపు..

కొత్తగూడెంటౌన్: ఎన్నికల ప్రచారంలో హడావుడిగా ఉండే బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బుధవారం కొద్దిసేపు యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ నెల 5న కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో సీఎం హాజరయ్యే ప్రజా ఆశీర్వాద సభ జరగనుంది. దీంతో ఆయన బుధవారం రాత్రి సభ ఏర్పాట్లు పరిశీలించారు. అదే సమయంలో అక్కడ వాలీబాల్ ఆడుతూ యువకులు కనిపించగా, వారితో సరదాగా కాసేపు వాలీబాల్ ఆడారు.



ప్రకాశం స్టేడియంలో యువకులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న ఎంపీ రవిచంద్ర

14 కేజీల గంజాయి స్వాధీనం

పాల్వంచ: అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తుల నుంచి ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందు ఆటోస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు లగేజ్ బ్యాగ్‌లతో అనుమానాదాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా వారి బ్యాగ్‌లలో 14 కేజీల గంజాయి లభించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భవితోష్, ఒడిశాకు చెందిన కిషోర్‌గా తేలింది. వీరు భద్రాచలంలో గంజాయి కొనుగోలు చేసి పాల్వంచ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నామని, గంజాయి విలువ రూ.3.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చుంచుపల్లి: ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొని గాయాలై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచకు చెందిన పెయింటర్ పాగ ప్రవీణ్(24) ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం నుంచి సుజాతనగర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చుంచుపల్లి బృందావనం వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో సైడ్‌వాల్‌పై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని 108 ద్వారా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నట్లు చుంచుపల్లి పోలీసులు తెలిపారు.

భూకబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

పాల్వంచ: మండల వ్యాప్తంగా భూకబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ ఎస్ఐ బాణాల రాము కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని వెంగళరావు కాలనీకి చెందిన షేక్ రహీమున్నీసాకు 2007లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో అదే కాలనీ నిర్మాణం చేపట్టింది. ఆర్థిక పరిస్థితులు సరిగా లేక నిర్మాణాన్ని అసంపూర్తిగా నిలిపివేసింది. ఇదే క్రమంలో ఆమె భర్త మృతి చెందడంతో హైదరాబాద్ వెళ్లి తల్లి ఇంటి వద్ద ఉంటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె ఇక్కడలేదని భావించిన అదే కాలనీకి చెందిన వానపాకుల రాంబాబు అనే వ్యక్తి తన అనుచరురాలైన భద్రమ్మతో ఇంటి పై కప్పు వేయించి అందులో ఉంచాడు. విషయం తెలుసుకున్న రహీమున్నిసా ఇక్కడకు చేరుకుని ప్రశ్నించగా బెదిరింపులకు దిగారు. తమ యూనియన్‌లో చేరితే మరో చోట 90 గజాల ఇంటి స్థలం ఇప్పిస్తామని, ఈ స్థలం ఇవ్వడం కుదరదని బెదిరించారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రాము ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎవరీ బాలుడు..?

వారం రోజులుగా మారాయిగూడెంలోనే...



బాలుడు

దుమ్ముగూడెం : మండలంలోని మారాయిగూడెం శ్రీ సమ్మక్క సారలమ్మ గుడి దగ్గర వారం రోజుల నుంచి ఓ ఏడేళ్ల కుర్రాడు ఉంటున్నాడు. తన పేరు కారం అనిల్ అని చెబుతున్నా బాలుడు మిగతా వివరాలు తెలపడం లేదు. వారం రోజులుగా దేవరబాలలు శాంతమ్మ, అచ్చమ్మల ఇంటిదగ్గర అన్నం తిని ఆ గుడి దగ్గరే ఉంటున్నాడు. ఆ కుర్రాడి వివరాలు కోసం తెలుసుకునేందుకు ప్రయత్నించగా పేరు అనిల్ అని, ఊరు ముసిలేరు అని చెబుతున్నాడు. తల్లిదండ్రుల పేర్లు చెప్పడంలేదు. బాలుడిని గుర్తుపట్టేవారు మారాయిగూడెం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం దేవరబాలలు శాంతమ్మ, అచ్చమ్మలను సంప్రదించాలని గ్రామస్తులు తెలిపారు.


నాటు సారా స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం మాధారం నుంచి ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న 30 లీటర్ల నాటుసారాను బుధవారం మండలంలోని కొత్తూరు చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సారాను తరలిస్తున్న కొత్తూరు గ్రామానికి చెందిన డేరంగుల కృష్ణ, సంధ్యను అదుపులోకి తీసుకొని ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎక్సైజ్ సీఐ నాగయ్య తెలిపారు. ఎక్సైజ్ ఎస్సైలు కె రాజేశ్వరరావు, సీహెచ్ శ్రీహరిరావు, సిబ్బంది ఉన్నారు.

దుమ్ముగూడెంలో 8 లీటర్లు..

దుమ్ముగూడెం : మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామంలో పోలీసులు బుధవారం 8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సుజ్ఞానపురం గ్రామానికి చెందిన, నిందితుడు గుగుల్ రాంప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేశవరావు, ఏఎస్ఐ సత్యనారయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటేష్ మృతదేహం

పాల్వంచ: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దంతెలబోర గ్రామ పంచాయతీలో మల్టీవర్కర్‌గా పనిచేసే కుంజా వెంకటేష్(35) బుధవారం గ్రామస్తులతో కలిసి గంగదేవి గుప్ప సమీపంలోని మొర్రేడు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. విద్యుత్‌తో చేపలు పట్టేందుకు వైర్లను స్తంభానికి తగిలించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు, కాగా తల్లిదండ్రులు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా.. సమాచారం రావడంతో వెళ్లి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

బూర్గంపహాడ్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బూర్గంపాడులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కేసుపాక ప్రసాద్(32)కు ఏపీలోని వేలేరుపాడు రుద్రంకోటకు చెందిన దేవితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ప్రసాద్ గతంలో కారు నడిపి జీవనం సాగించేవాడు. ప్రస్తుతం ఉపాధి లేక మనోవేదనకు గురవుతున్నాడు. ఇటీవల భార్య అనారోగ్య సమస్యలతో వేలేరుపాడు వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.